పైప్‌లైన్ పనులపై విచారణ జరిపించాలి



కాముని చెరువు వద్ద ఎస్‌టీపీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న బండి రమేష్, తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గం, బాలాజీనగర్‌లో మెఘా ఇంజినీరింగ్ కంపెనీ చేపట్టి నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక కాముని చెరువు వద్ద నిర్మిస్తున్న ఎస్‌టీపీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు హామీల్లో ఇప్పటికే ఐదు హామీలను అమలు చేశామని, ఆరవ పథకం కూడా త్వరలో అమ లు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లు చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌తో పాటు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. ఈ కబ్జాలపై ఉన్నతాధికారులకు ఫిర్యా దు చేసినట్లు తెలిపారు. దీనిపూ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆయన బుధవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని సేవాలాల్ నగర్, రాఘవేంద్ర నగర్‌లలో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జీఓ నంబర్ 58,59 ద్వారా పేదలు నివసిస్తున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డులను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, నాగిరెడ్డి, శేరి సతీష్ రెడ్డి, గోపిశెట్టి దినేష్ కుమార్, ప్రతాప్ రెడ్డి, కృష్ణ రాజ్‌పుత్, ప్రవీణ్, మేకల రమేష్, మహిళా నాయకరాళ్లు పుష్పరెడ్డి, జ్యోతి, రేష్మ, కృష్ణవేణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీకేర్ ఫుల్..

సోషల్ మీడియాలో రాజకీయ అంశాలు.. వార్తల పరిశీలన

- నిబంధనలకు విరుద్ధమైన పోస్టులపై కఠిన చర్యలు
- అడ్మిన్‌కు నోటీసులు.. ఆ తర్వాత క్రిమినల్ కేసులు
- ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ నియామకం

పార్లమెంట్ ఎన్నికల వేళ.. ఎన్నికల సంఘం సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టింది. రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలనపై దృష్టి సారిస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. సంబంధిత అంశాల మేరకు అడ్మిన్‌కు నోటీసులు అందజేయడంతో పాటు క్రిమినల్ కేసుల నమోదుకు కూడా సిద్ధం అవుతున్నట్లు పేర్కొంటున్నారు. – సాక్షి, మేడ్చల్ జిల్లా



◆ శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో నగర, పట్టణ, బస్తీ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువతీయువకులు అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం కొన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా టీమ్‌లు(వారియర్స్) కూడా నియమించి.. ప్రచారానికి అంత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల పోస్టులతో రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాతో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

◆ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాలో నమోదు చేస్తున్న ప్రచార కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని నియమించారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ–జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి యూ.అరుంధతి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఎం.వెంకటరమణ, కె.వెంకటేశ్వర్లును సభ్యులుగా నియమించారు. వీరు ప్రతిరోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే రాజకీయ అంశాలు, వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు..

సోషల్ మీడియాల్లో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిషన్‌పై, పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్ష విధిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్లు నమోదు చేసి కేసులు పెడతారని పేర్కొంటున్నారు.

సాయిబాబా ఆలయాల్లో అన్నదానం

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్ ప్రధాన రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదే విధంగా పాండురంగనగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవంతినగర్ తోట శ్రీషిరిడి సాయిబాబా దేవాలయంలో, స్నేహపురి కాలనీలో, అల్లాపూర్ డివిజన్ శ్రీ గణేష్ నగర్ సాయిబాబా దేవాలయం, శ్రీ వివేకానందనగర్ షిరిడి సాబాబా దేవాలయాల్లోనూ అన్నదానాలు కొనసాగుతున్నాయి.

పంచశీల స్కూల్‌లో ఆధార్ సెంటర్ ఏర్పాటు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కేంద్రం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అభినందనలు



ఎంఏ ఫహీమ్‌కు అభినందనలు తెలుపుతున్న యాదగిరి తదితరులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర పుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎంఏ ఫహీమ్‌ను బుధవారం వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ భారత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఈటల విజయానికి కృషి చేయాలి



ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మోతీనగర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గాయత్రినగర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించడమే మన కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు వేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించడానికి రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ, శ్రీ వివేకానందనగర్ సేవా సమితి అధ్యక్షుడు గంగుమళ్ల వరప్రసాద్, నాయకులు మల్లేష్, రాజ్‌కుమార్, భానుప్రసాద్, అంకిత్‌సింగ్, కమ్మరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు....

మూసాపేట: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో కలిసిన మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, పోలాకి కిషోర్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బక్కారెడ్డి మృతి బీజేపీకి తీరని లోటు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ బీజేపీ సీనియర్ కార్యకర్త బక్కారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం కన్నుమూశారు. ఈ విషయం తెలియడంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బక్కారెడ్డి పార్థీవ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. బక్కారెడ్డి లాంటి కార్యకర్తను కోల్పోవటం పార్టీకి తీరని లోటని అన్నారు.

ఈటల పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం



ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాధవరం కాంతారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏర్పాటు చేసిన ఈఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భారీ మెజారిటీతో గెలిపించుకోవడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యమూర్తి, జగదీష్ బాబు, మనోజ్ యాదవ్, అరుణ్, లక్ష్మి, సాయి, కార్తీక్, యశ్వంత్, సాయి లోహిత్, చారి, అనిల్, సురేష్, దీపక్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు....

మూసాపేట: అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

1 ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు జోనల్ కమిషనర్ సూచన



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ అంశాల ముద్రణలో ఎన్నికల సంఘం సూచనలు అనుసరించాలన్నారు. ఎన్నికల ప్రింటింగ్‌కు సంబంధించి ప్రత్యేక ఖాతా నిర్వహించాలని సూచించారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ అందించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గం రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా నాటి మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. దీనికి కృతజ్ఞతగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దానం నాగేందర్‌కు శుభాకాంక్షలు



దానం నాగేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సింగజోగి కృష్ణ, తదితరులు

బాలానగర్: ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా బుధవారం ఓబీసీ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ చైర్మన్, టీపీసీసీ మాజీ సెక్రటరి సింగజోగి కృష్ణ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో నాగేందర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సుదీప్ పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుదీప్‌పటేల్, దండు మల్లేష్ గౌడ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి సీజ్

ఒకరి అరెస్ట్.. సెల్‌ఫోన్ స్వాధీనం

హఫీజ్‌పేట్: లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద పది కిలోల గంజాయిని పట్టుకున్నారు పోలీసులు. ఈ ఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన రాహుల్ బైద్య (21) గంజాయికి బానిసయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన జగన్నాథ్ బిస్వాస్‌లు కలిసి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో నివాసముండే విక్రమ్ అలియాస్ వివేక్‌కు గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు సుమారు 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా సమాచారమందుకున్న శంషాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ ఆదేశాలతో, శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులతో కలిసి లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ రాహుల్ బైద్య అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో వెంటనే ఎక్సైజ్ పోలీసులు గమనించి అదుపులోకి తీసుకుని చూడగా బ్యాగులో సుమారు 10 కిలోల గంజాయిని గుర్తించారు. ఈ మేరకు శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ పోలీసులు శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతని వద్ద నుంచి 10 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శంషాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య లీడర్ల సమస్యలు పరిష్కరిస్తా



మహిళా సమాఖ్య లీడర్లతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: మహిళా సమాఖ్య లీడర్లు ఎదుర్కొంటున్న ససమ్యలను పరిష్కరిస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహిళా సమాఖ్య లీడర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సమస్యలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య లీడర్లు షేక్ బీబీ, సౌందర్య, నిర్మలమ్మ, లలిత కుమారి, దేవి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

దుండిగల్: విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఎంఎల్‌ఆర్ ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. లక్ష్మణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం స్పోర్ట్స్ డేను నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం రూ.1.50 కోట్లతో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని అన్నారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్విమ్మర్ శ్యామల గోలి, యోగ గురువు శ్రీకృపాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రేయారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు ఇబ్బంది.. నేడు సాఫీగా..



గద్దెను తొలగించడంతో ప్రస్తుతం సాఫీగా రాకపోకలు



గతంలో విప్రో సర్కిల్‌లో ప్రధాన కూడలి మధ్యలో గద్దె (ఫైల్)

రాయదుర్గం: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ప్రధాన కూడలిలో నేడు వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతోంది. ఒకప్పుడు ఈ కూడలి మధ్యలో సెంట్రల్ లైటింగ్ దాని చుట్టూరా గద్దె నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు దీని చుట్టూ ప్రయాణించాల్సి వచ్చేది. కానీ దీన్ని తొలగించి వేయడంతో ప్రస్తుతం నలు దిక్కులా వాహనదారులు సాఫీగా రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అయింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని పలు ఐటీ, ఇతర అంతర్జాతీయ సంస్థలకు వెళ్ళేందుకు ఇదే ప్రధాన కూడలి. దీనికితోడు ఔటర్ రింగు రోడ్డు, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, కేశవనగర్ వంటి ప్రాంతాలకు వెళ్ళేందుకు కూడా ఇదే ప్రధాన కూడలి కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఆతర్వాత సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కూడలిలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో టీఎస్ఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో మార్గం సుగమమైంది.

'కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేది లేదు'

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'హస్తగత వ్యూహం' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కొందరు నేతలు బీఆర్‌ఎస్ పార్టీలోనే తాము కొనసాగుతామని... ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారే ప్రసక్తే లేదని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిలు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. మల్కాజిగిరి టికెట్ ఆశిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సునీతరెడ్డి భర్త మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఇటీవల పలువురు కార్పొరేటర్లను కలుస్తూ మద్దతు కోరుతూ ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు మరో 9 మంది పార్టీ మారుతున్నట్లు తెలిసింది. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో ఉండే రెండు సర్కిల్లో ఉన్న నలుగురు కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేది లేదని ప్రకటన విడుదల చేశారు. తాము బీఆర్‌ఎస్ పార్టీకి పనిచేస్తూ ఆ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని కార్పొరేటర్ రావుల శేషగిరి 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.

ఇంటింటికీ ఫామ్ 12డీ పంపిణీ చేయాలి

పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసేలా చర్యలు

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, 85 సంవత్సరాల దాటిన వృద్ధులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ అధ్యక్షతన నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చేందుకు వీలుగా ఫామ్–12డీని ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని ఆదేశించారు. వివరాలు నమోదు చేసిన ఫామ్ 12డీని ఈ నెలాఖరు వరకు తిరిగి సేకరిస్తామని ప్రభుదాస్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 5798 మంది ఓటు హక్కు కలిగిన దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వారు 2059 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్ఐ కవిత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలి



మేయర్ నీలారెడ్డిని సత్కరిస్తున్న జీఎల్‌ఆర్‌కాలనీ నూతన కమిటీ సభ్యులు

నిజాంపేట్: కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని జీఎల్‌ఆర్ కాలనీ నూతన అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్ స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టి కాలనీలో మౌలిక వసతులు మెరుగుపరుస్తామన్నారు. కాలనీ ఉపాధ్యక్షులు కళ్యాణ్, శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బాపిరాజు, సంయుక్త కార్యదర్శి సురేష్‌రెడ్డి, కోశాధికారి సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్, శివ, ఆర్.కె.రాజు, జోగేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సిద్ధార్థ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిముక్కల భాస్కరరావు, విద్యార్థినులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు., సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వ హించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రెసిడెంట్ గొట్టి ముక్కల భాస్కరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఇ. మధుసూధన్‌రావు, ఎస్. అరవింద్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ. పద్మప్రియ, ఎన్. చంద్రశేఖర్ నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు తాము స్వయంగా తయారుచేసిన ఆహార పదార్థాలను తోటి విద్యార్థులకు విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సమాజ సేవ కోసం వెచ్చిస్తున్నట్లు తెలిపారు.